సాక్షి
నిజామాబాద్

శనివారం ǀ 9 ǀ ఆగస్టు ǀ 2025

వైభవంగా వరలక్ష్మి వ్రతం

జిల్లా వ్యాప్తంగా మహిళలు శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని వరలక్ష్మి పూజలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు, సామూహిక వ్రతాలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఇళ్లలో వరలక్ష్మి వ్రతాలను ఆచరించి సుమంగళీలు వాయినాలు సమర్పించారు.



నగరంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు

న్యూస్‌రీల్

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లు, పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.


బంగారంతో ఉడాయించిన బెంగాలీ బ్రదర్స్

ఆర్మూర్‌టౌన్‌: బంగారు ఆభరణాలకు మెరుగులు పెట్టే బెంగాలీ వర్కర్లు స్వర్ణకారులు అప్పగించిన బంగారంతో ఉడాయించిన ఘటన ఆర్మూర్‌లో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన అతియార్, బపన్ అనే అన్నదమ్ములు ఎనిమిది సంవత్సరాల క్రితం బంగారు నగలకు మెరుగులుదిద్దే పనిపై ఆర్మూర్‌కు వలస వచ్చారు. 8 సంవత్సరాలుగా స్థానిక బంగారు వర్తకులను నమ్మిస్తూ పనులు కొనసాగించారు. ఒక్కసారిగా బంగారు నగలు సమకూరగానే బిచానా సర్దేశారు. కాగా, 18 తులాల బంగారంతో ఉడాయించినట్లు నలుగురు బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, సదరు అన్నదమ్ములు సుమారు అర కిలో బంగారంతో పరారైనట్లు మరికొంత మంది బాధితుల ద్వారా తెలిసింది. కాగా, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

స్టేడియం ఊసేదీ..?

- ఒక అడుగు ముందుకు.. పది అడుగులు వెనక్కి
- ఇండోర్ స్టేడియం విషయంలోనూ ఇదే పరిస్థితి
- సౌకర్యాలు లేకున్నా అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు
- పాత కలెక్టరేట్ మైదానంలో ఎల్‌బీ స్టేడియం తరహాలో నిర్మించాలని ప్రజల డిమాండ్
- మెడికల్ కళాశాల గ్రౌండ్‌గా ఎంసీఐకు చూపిస్తున్నట్లు చర్చ

అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి, పతకాలతో దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిన ప్రతిభావంతమైన క్రీడాకారులు ఉన్న జిల్లా నిజామాబాద్. ఇక్కడ క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించేందుకు గాను స్టేడియం, ఇండోర్ స్టేడియం నిర్మాణం చేయాలనే డిమాండ్లు ఏళ్లుగా ఉన్నాయి.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: నగరం నడిబొడ్డున ఉన్న పాత కలెక్టరేట్ స్థలంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం తరహాలో నిర్మించాలని ప్రజలు, క్రీడాభిమానులు కోరుతున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అంతంత మాత్రమే ఉన్నప్పటికీ పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై అద్భుత ప్రతిభ కనబరిచారు. కాగా, ప్రభుత్వం నుంచి తగిన సౌకర్యాలు, సహకారం లభించకపోతుండడంతో ప్రతిభ ఉన్నప్పటికీ అనేకమంది ఔత్సాహిక క్రీడాకారులు వెనుకబడిపోతున్నారు.

సర్వే పూర్తయినా..

స్టేడియం నిర్మాణం కోసం 2024 నవంబర్ 11న సర్వే పూర్తిచేశారు. నిధుల మంజూరే ఆలస్యమని కీలక నాయకులు ప్రకటనలు చేశారు. కానీ, అది మళ్లీ పది అడుగులు వెనక్కి వెళ్లినట్లు జిల్లాలో చర్చ జరుగుతోంది. పాత కలెక్టరేట్ మైదానాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాల గ్రౌండ్ కోసం కేటాయించినట్లు ఇప్పటికే ఎంసీఐ (మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా)కు చూపినట్లు, దీంతో ఇందులో స్టేడియం నిర్మాణం సాధ్యం కాదని చెబుతున్నట్లు తెలుస్తోంది. దీంతో స్టేడియం మంజూరు అనేక అడుగులు వెనక్కి వెళ్లినట్లు సమాచారం.

■ సర్వే మేరకు ఈ మైదానంలో 8 లేన్లతో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్, ఉత్తర దక్షిణాలకు 188 మీటర్లు, తూర్పు పడమరకు 125 మీటర్లు ఉండేలా ప్లాన్ చేశారు. లైన్ వెడల్పు 1.22''బ్లేన్స్''2=19.52 మీటర్లు, కర్వ్ డిస్టెన్స్(వంపు దూరం) 36.50''2=73.00 మీటర్లు, లెంగ్త్ ఆఫ్ స్ట్రెయిట్ 84.39''1=84.39 మీటర్లు, ఫ్రీ జోన్ 05మీ''2=10.00 మీటర్లు, మొత్తం 186.91 మీటర్లతో నిర్మించేందుకు అంచనాలు తయారు చేశారు. విడ్త్ విషయానికి వస్తే లైన్ విడ్త్ 1.22''బ్లేన్స్''2=19.52 మీటర్లు, కర్వ్ డిస్టెన్స్ 36.50''2=73.00 మీటర్లు, లాంగ్ జంప్ కోసం 9 మీటర్ల వెడల్పు, ఫ్రీ జోన్ 5 మీటర్లు+10 మీటర్లు = 15 మీటర్లు ఉండేలా మొత్తం 116.52 మీటర్లతో ప్లాన్ తయారు చేశారు.

■ పాత కలెక్టరేట్ మైదానంలో స్టేడియం సమీపంలోని స్థలంలో ఇండోర్ స్టేడియం నిర్మించాలనే డిమాండ్లు ఏళ్లుగా ఉన్నాయి. లోపల ఫుట్‌బాల్ మైదానంతోపాటు దాని చుట్టూ 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటు, మరోవైపు బాస్కెట్ బాల్ కోసం, మరో వైపు బాక్సింగ్ ఇండోర్ స్టేడియం, ఉషు, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ ఇండోర్ స్టేడియాలు నిర్మించాలని డిమాండ్లు ఉన్నాయి. ఇక స్టేడియం చుట్టూ కమర్షియల్ కాంప్లెక్స్ షెట్టర్లు నిర్మించి నిర్వహణ కోసం ఆదాయం రాబట్టుకోవచ్చు.

■ తగిన సౌకర్యాలు, ప్రభుత్వ కోచ్‌లు, ప్రోత్సాహం లేకున్నప్పటికీ అంతర్జాతీయ పతకాలు సాధించిన ఆణిముత్యాలైన క్రీడాకారులు నిజామాబాద్ జిల్లాలో ఉన్నారు. బాక్సింగ్‌లో హుస్సాముద్దీన్, నిఖత్ జరీన్, హాకీలో యెండల సౌందర్య, ఫుట్‌బాల్ క్రీడలో గుగులోత్ సౌమ్య అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. జిల్లాకు చెందిన ఎతెసామ్ భారత ఆర్మీ బాక్సింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

■ నగరం నడిబొడ్డున క్రీడా స్టేడియంతో కూడిన మైదానాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ అథ్లెటిక్స్ జాతీయ మెడలిస్ట్, ఉస్మానియా యూనివర్సిటీ రికార్డ్ హోల్డర్ సయ్యద్ ఖైసర్ 2010లో మూడు రోజులపాటు నిరాహార దీక్ష చేశారు. అదేవిధంగా నగరంలో స్టేడియం కోసం 4 కిలోమీటర్ల మేర రన్నింగ్ చేశాడు.

సౌకర్యాలు అంతంత మాత్రమే..

అంతంతమాత్రం సౌకర్యాల మధ్యే పలువురు క్రీడాకారులు ప్రతిరోజూ ప్రాక్టీస్ చేసి ఎదిగారు. పలువురు వర్ధమాన క్రీడాకారులు సైతం ఇదేరీతిలో ప్రాక్టీస్ చేస్తుండడం గమనార్హం. జిల్లాలో గత కొన్నేళ్లుగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేసిన దాఖలాలు లేవు. క్రీడాకారుల కోసం కోచ్‌లను సైతం నియమించలేదు. అయినప్పటికీ ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటారు. ఇప్పటి వరకు అందరూ పాత కలెక్టరేట్ మైదానంలోనే ఇబ్బందులు పడుతూ ముందుకెళుతున్నారు. ఈ ఒక్క మైదానంలోనే హాకీ, బాక్సింగ్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఉషూ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడలకు సీనియర్ క్రీడాకారులు శిక్షణ ఇస్తున్నారు.



పాత కలెక్టరేట్ మైదానం

ఒక్క స్టేడియంతో అనేకమంది క్రీడాకారులు..



నగరంలో స్టేడియం, ఇండోర్ స్టేడియం నిర్మిస్తే అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటే క్రీడాకారులను భారీ సంఖ్యలో తయారు చేయొచ్చు. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు ఉన్నతంగా ఎదుగుతున్నారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనే పతకాలు సాధించినప్పటికీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా మధ్యలోనే ఆపేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం సహాయ సహకారాలు అందించి క్రీడాభివృద్ధికి కృషి చేయాలి. – సయ్యద్ ఖైసర్, జాతీయ అథ్లెటిక్స్ గోల్డ్ మెడలిస్ట్, శిక్షకుడు

క్రీడాకారులకు, కోచ్‌లకు గుర్తింపు ఇవ్వాలి..



నగరంలో స్టేడియం కోసం వేలాది క్రీడాకారులు ఎదురుచూస్తున్నారు. తగిన సౌకర్యాలు కల్పించనప్పటికీ మావంతుగా క్రీడాకారులకు శిక్షణనిస్తున్నాం. నాలాంటి ఎంతో మంది కోచ్‌లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా కోచ్‌లను అభినందించలేదు. ఫుట్‌బాల్ విషయంలో క్రీడామైదానం లేకుంటే ఖాళీ స్థలాలను అద్దెకు తీసుకుని మరీ శిక్షణ ఇస్తున్నాను. పతకాలు సాధించిన తరువాత ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. – నాగరాజు, ఫుట్‌బాల్ కోచ్



సెల్ఫీ విత్ రాఖీ..

తోబుట్టువుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచేది రక్షాబంధన్. నేడు పండుగను పురస్కరించుకొని సోదరులకు సోదరీమణులు రాఖీలు కడతారు. సోదరులు వారికి తోచిన కానుక అందించి, ఆశీర్వాదం తీసుకుంటారు. కుటుంబమంతా జరుపుకొనే ఈ వేడుకలను సెల్ఫీ తీసుకొని మురిసిపోతారు. మీ సెల్ఫీలను 'సాక్షి'తో పంచుకోవాలనుకుంటున్నారా? అయితే మా నెంబర్‌కు మీ సెల్ఫీలను పంపండి.

నెంబర్ : 99897 09595

రైతుబజార్లను సద్వినియోగం చేసుకోవాలి

- నగరంలో మార్కెట్లను పరిశీలించిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- రోడ్లపై కూరగాయలు విక్రయించడంతో ఆగ్రహం
- అమృత్ 2.0 పనుల పరిశీలన



పులాంగ్ రైతుబజార్‌లో కూరగాయలు విక్రయిస్తున్న వ్యక్తితో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్ సిటీ: ఇందూరు వాసుల కోసం జిల్లా కేంద్రంలో కేటాయించిన రైతుబజార్లను సద్వినియోగం చేసుకోవాలని, వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ నగరంలో పర్యటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు బజార్లను వర్తకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పులాంగ్ వద్దనున్న రైతుబజార్, డీఎస్ మార్కెట్‌ను పరీక్షించారు. వీక్లీ మార్కెట్, సుభాష్‌నగర్, శివాజీనగర్ ప్రాంతాలలో రోడ్లమీద కూరగాయలు విక్రయించడంపై అసహనం వ్యక్తం చేశారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్మించి వృథాగా ఉన్న మినీ మార్కెట్‌లను పరిశీలించి వాటిని వినియోగంలోకి తేవాలన్నారు. పాత గంజ్‌లో కొనసాగుతున్న మార్కెట్‌ను చూశారు. ఖలీల్‌వాడిలో నిర్మిస్తున్న సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాలను పరిశీలించి మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. రోడ్ల పక్కన కూరగాయల అమ్మకంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కూరగాయలు, పండ్ల విక్రేతలు రోడ్ల పక్కన కాకుండా రైతుబజార్లలో అమ్మకాలు జరిపేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. రైతు బజార్ల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్, మార్కెటింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. ఆక్రమణలను గుర్తించి, వాటిని తొలగించేందుకు డీ-మార్కింగ్ చేయాలన్నారు. అనంతరం అమృత్ 2.0 పథకంలో భాగంగా నాందేవ్‌వాడ, గౌతంనగర్‌లలో చేపడుతున్న మంచినీటి ట్యాంకుల నిర్మాణ పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. నాగారం 300 క్వార్టర్స్‌లోని బస్తీ దవాఖానను కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ ఈఈ మురళీ మోహన్ రెడ్డి, డీఈలు సుదర్శన్‌రెడ్డి, ముస్తాక్ అహ్మద్, రషీద్, ఏఈ పావని, ఇనాయత్ కరీం, ఏసీపీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లక్ష్మి ఆయకట్టులో జోరుగా వరినాట్లు

- నీటి విడుదలతో రైతుల హర్షం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మికాలువ ద్వారా నీటి విడుదలతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు నీరు లేక రైతులు వరినాట్లు వేయలేదు. ప్రస్తుతం ఎస్సారెస్పీ నుంచి సాగునీరు విడుదల కావడంతో వరినాట్లు జోరందుకున్నాయి. కాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీరు ప్రవహించడంతో లక్ష్మికాలువ చివరి ఆయకట్టు డీ-4 కాలువ వరకు నీటి సరఫరా జరుగుతోంది. డీ-3పై నిర్మించిన వేంపల్లి ఎత్తిపోతల పథకం నుంచి సైతం నీటి విడుదలను శుక్రవారం ప్రారంభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మి ఆయకట్టులో వరినాట్లు వేస్తున్న కూలీలు

సీఎంసీ మోసంలో.. అసలు సూత్రధారులెవరూ?

- ప్రజాప్రతినిధులు అడిగినా లీజుకు ఇవ్వని సీఎస్‌ఐ మెదక్ డయాసిస్ పెద్దలు
- షణ్ముక మహాలింగానికి అనుమతులు
- పెట్టుబడుల రూపంలో వైద్యుల నుంచి రూ. కోట్లు వసూలు చేసిన షణ్ముక
- మోసపోయిన పలువురు జిల్లా డాక్టర్లు

నిజామాబాద్‌నాగారం/ డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారులో గల సీఎంసీ (క్రిస్టియన్ మెడికల్ కాలేజ్) పునఃప్రారంభం పేరిట వైద్యులను మోసం చేసిన విషయంలో సూత్రధారులెవరనే ప్రశ్నలు విన్పిస్తున్నాయి. మాజీ ఐఏఎస్ పేరిట వైద్యులను నమ్మించి, కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టించి మోసం చేసిన షణ్ముక మహాలింగం వెనక ఎవరున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. పక్కా పథకం ప్రకారమే వైద్యుల డబ్బులకు ఎసరు పెట్టారనే చర్చ నడుస్తోంది.

పేరు మార్చి తాత్కాలిక అనుమతులు

సీఎంసీని పునఃప్రారంభిస్తామని, అందులో భాగంగా 50 పడకలతో ఆస్పత్రిని సైతం అందుబాటులోకి తేస్తామని గతేడాది ఏప్రిల్ 27న జిల్లా వైద్యారోగ్యశాఖలో డాక్టర్ ముద్దమాల ఇసాక్ అభిలాష్ పేరిట దరఖాస్తు చేశారు. మూడు నెలల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసి, వైద్యులను నియమించుకొని సేవలు అందిస్తామని దరఖాస్తులో పేర్కొన్నా రు. దీంతో నిబంధనల ప్రకారం డీఎంహెచ్‌వో తాత్కాలికంగా మూడు నెలల అనుమతి ఇచ్చారు. కాగా, జూలై 26తో గడువు ముగియడం, ఎంసీఐ అనుమతి రాకపోవడంతో మెడికల్ కాలేజీ ప్రారంభం కాలేదు. మళ్లీ ఈ ఏడాది మే 19న మరోసారి సీఎంసీ పునఃప్రారంభం కోసం సీఎస్ఐ మెడికల్ ట్రస్ట్ పేరిట డాక్టర్ విమల్‌కుమార్ సుకుమార్, డాక్టర్ ముద్దమాల ఇసాక్ అభిలాష్ దరఖాస్తు చేశారు. గతంలో మాదిరిగానే మూడు నెలల్లో వసతులు, సౌకర్యాలు కల్పిస్తామని వైద్యాధికారులతో పేర్కొన్నారు. అయితే ప్రస్తుత డీఎంహెచ్‌వో అనుమతి ఇవ్వడానికి ససేమేరా అనడంతో పలువురితో ఒత్తిడి తీసుకువచ్చారు. ఐఎంఏ ప్రతినిధులు వచ్చి విన్నవించడంతోపాటు 26 మంది వైద్యుల పేర్లతో కూడిన జాబితాను అందజేయడంతో తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. ఆ గడువుకు కూడా ఈ నెల 18తో ముగియనుండడం గమనార్హం.

తెరమీదకు రిటైర్డు ఐఏఎస్ పేరు..

దేశ, రాష్ట్రస్థాయిలో పలుకుబడి ఉన్న జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నేతలు అడిగినా లీజుకు ఇచ్చేందుకు సీఎస్ఐ మెదక్ డయాసిస్ మెడికల్ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఒప్పుకోలేదు. కానీ, కర్ణాటకకు చెందిన షణ్ముక మహాలింగం తాను రిటైర్డ్ ఐఏఎస్‌ను అని చెప్పుకోగానే లీజు ఒప్పందం చేసుకోవడం విస్మయం కలిగిస్తోంది. షణ్ముక మహాలింగంను ట్రస్ట్ సభ్యులు ఎలా నమ్మారో అర్థం కావడం లేదని స్థానిక క్రిస్టియన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. షణ్ముక మహాలింగంకు జిల్లాలోని వైద్యులతో నేరుగా సంబంధాలు ఉన్నాయా? లేదంటే ఇక్కడికి ఎలా వచ్చారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతేడాది దరఖాస్తు చేసిన ఇసాక్ అభిలాష్ మళ్లీ ఈసారి కూడా దరఖాస్తు చేసుకోవడం చూస్తే పక్కా ప్లాన్ ప్రకారమే ఇదంతా జరిగిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. డాక్టర్ అజ్జ శ్రీనివాస్‌కు డైరెక్టర్ పదవి ఇస్తామని చెప్పి అతడితో రూ.2.20 కోట్లు పెట్టుబడులు పెట్టించడంతోపాటు మరో 26మంది వైద్యుల నుంచి సుమారు రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు షణ్ముక మహాలింగం వసూలు చేసినట్లు తెలుస్తోంది. సీఎంసీకి ఎంసీఐ అనుమతి నిరాకరణతోనే ఈ మోసాలన్నీ బయటకు రావడం గమనార్హం.

అసలు షణ్ముకను ఇక్కడికి రప్పించిందెవరు? షణ్ముకకు ఢిల్లీలో మంచి సంబంధాలున్నాయని, ఎంసీఐ నుంచి మెడికల్ కళాశాలకు సులువు గా అనుమతి తీసుకువస్తారని జిల్లాలోని వైద్యులను నమ్మించిందెవరు? అనేది తెలియాల్సి ఉంది.



షణ్ముకకు ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ సహకారం?

ఖలీల్‌వాడి: సీఎంసీ పేరిట డాక్టర్ల వద్ద నుంచి రూ.కోట్లు నొక్కేసిన షణ్ముక మహాలింగానికి ఓ ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ సహకరించినట్లుగా తెలుస్తోంది. కొన్నేళ్ల నుంచి ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్‌కు తెలిసిన వారి ద్వారా షణ్ముక మహాలింగం పరిచయమయ్యాడు. దీంతో తన ఇంటి పక్కనే అతనికి ఓ ఇంటిని అద్దెకు ఇప్పించడంతో పాటు షణ్ముకకు కావాల్సిన వాటిని కానిస్టేబుల్ కుటుంబసభ్యులే చూసుకునేవారని తెలిసింది. షణ్ముక నిజామాబాద్ నుంచి సీఎంసీకి వెళ్లేందుకు ఓ కారు డ్రైవర్‌ను సైతం సమకూర్చినట్లు తెలుస్తోంది. కాగా, మూడు నెలలైనా షణ్ముక వేతనం చెల్లించకపోవడంతో సదరు డ్రైవర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సదరు కానిస్టేబుల్ తనకున్న పలుకుబడితో పీఎస్‌లో కేసును సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయినా జీతం డబ్బులు చెల్లించకపోవడంతో షణ్ముక ఇంటికి డ్రైవర్ తాళం వేయడంతో కానిస్టేబుల్ వెళ్లి సమస్యను పరిష్కరించినట్లు తెలిసింది.

మాజీ డీఎస్పీతో పరిచయం

సీఎంసీ పునఃప్రారంభిస్తున్నారని ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ నగరానికి చెందిన ఓ మాజీ డీఎస్పీకి షణ్ముకను పరిచయం చేసినట్లు తెలిసింది. దీంతో సదరు మాజీ డీఎస్పీతో తరుచూ టాచ్‌లో ఉండేవారని తెలుస్తోంది. సీఎంసీకి సంబంధించిన వివరాలను కానిస్టేబుల్ సమక్షంలోనే వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. దీంతో మాజీ డీఎస్పీకి సీఎంసీలో ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీస్తున్నారనే చర్చ జరుగుతోంది.

నెల క్రితమే పోలీసుల విచారణ!

కర్నాటకకు చెందిన షణ్ముక మహాలింగంను నెల క్రితం పోలీసులు విచారణ చేసినట్లు తెలిసింది. మాజీ ఐఏఎస్ అధికారిని అని చెప్పుకున్నట్లు వచ్చిన ప్రచారంపై పోలీసులు ఆరా తీయగా, నకిలీ ఐఏఎస్‌గా విచారణలో తేలినట్లు సమాచారం. కాగా, పోలీసులు విచారణ చేస్తున్న సమయంలో షణ్ముక మహాలింగం వెంటే ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ సతీమణి ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆమెను పోలీసులు ప్రశ్నించగా, సీఎంసీలో ఉద్యోగిగా పని చేస్తున్నానని, తన భర్త ఇంటెలిజెన్స్‌లో పని చేస్తారని చెప్పినట్లు తెలుస్తోంది. ఏదైనా తన భర్తే చూసుకుంటారని చెప్పినట్లు పోలీస్‌వర్గాల్లో చర్చ జరుగుతోంది. డిచ్‌పల్లి పోలీసులు షణ్ముకను తీసుకువెళ్లినప్పుడు సైతం ఆమె వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. విచారణ అనంతరం డిచ్‌పల్లి పీఎస్‌లో షణ్ముకపై చీటింగ్ కేసు నమోదైంది. ఏదేమైనా ఈ కేసులో ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెచ్చినా..

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అప్పటి మంత్రి సుదర్శన్‌రెడ్డి వినతి మేరకు జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ మంజూరు చేశారు. అప్పటికే డిచ్‌పల్లిలో ఉన్న సీఎంసీ మూడు సంవత్సరాలు నడిచిన తర్వాత మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) అనుమతి నిరాకరణతో మూతపడింది. అయితే హాస్పిటల్‌తోపాటు మెడికల్ కాలేజీకి అవసరమైన అన్ని వసతి సౌకర్యాలు ఉండటంతో ప్రభుత్వం లీజు ప్రతిపాదన చేసింది. కానీ, లీజు ఇవ్వడానికి మెదక్ డయాసిస్ ప్రతినిధులు నిరాకరించారు. దీంతో ప్రభుత్వ మెడికల్ కాలేజీని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మరోసారి సీఎంసీ తెరమీదకు వచ్చింది. మాజీ ఎంపీ సీఎంసీ లీజుకు ఎంతగానో ప్రయత్నించినా సీఎస్ఐ మెడికల్ ట్రస్టు సభ్యులు నిరాకరించడంతో వీలు కాలేదు.

తాత్కాలిక అనుమతి ఇచ్చాం

జిల్లాలో ఏ ఆస్పత్రి ఏర్పాటు చేసినా తాత్కాలికంగా మూడు నెలల అనుమతి ఇవ్వడానికి ఆదేశాలు ఉన్నాయి. దాని ప్రకారం మూడు నెలల్లో పూర్తిస్థాయిలో వైద్యులు, వసతులు ఏర్పాటు చేయించాలని తాత్కాలిక అనుమతులు ఇచ్చాం. మూడు నెలల్లో నిబంధనల ప్రకారం ఫీజును డీడీ రూపంలో చెల్లించి, అన్నీ పక్కాగా ఉంటే అనుమతులు ఇవ్వడం జరుగుతుంది. లేకుంటే రద్దు చేస్తాం. మరో 10 రోజులు తాత్కాలిక అనుమతుల గడువు ఉంది. దీనిపై పోలీసు అధికారులు అడిగితే సమాచారం కూడా పంపించాం. – రాజశ్రీ, జిల్లా వైద్యాధికారి

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌ మున్సిపల్‌ కమిషనర్‌గా రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బల్దియా కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణ, తాగు నీటి సరఫరాపై సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. బల్దియాకు వచ్చే ఆదాయంతోపాటు బల్దియాకు రావాల్సిన బకాయిలపై శ్రద్ధచూపాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని వెల్లడించారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి బల్దియా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

గంటల తరబడి తిప్పాల్సిందే..



బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టలన్నా.. నీటి విడుదల పెంచాలన్నా.. తగ్గించాలన్నా గంటల తరబడి గేట్లను తిప్పాల్సిందే. లేదంటే గేట్లు లేవవు, దిగవు. గేట్లకు కరెంట్‌ సరఫరా లేకపోవడంతో సిబ్బంది చేతులతోనే వాటిని ఎత్తుతున్నారు. శుక్రవారం నీటి విడుదల పెంచడం కోసం ఉదయం 7గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు గేట్లను తిప్పితే 200 క్యూసెక్కులకు నీటి విడుదల పెరిగింది. గంటల తరబడి గేట్లను తిప్పడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన సుధాకర్‌గౌడ్‌



నిజామాబాద్‌ సిటీ: సీఎం రేవంత్‌ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం ఓవర్‌సీస్‌ కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు సుధాకర్‌ గౌడ్‌ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కులగణన విజయవంతంగా పూర్తిచేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు యత్నిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి, ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ ప్రజల తరఫున ఓవర్‌సీస్‌ కాంగ్రెస్‌ తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్ర‘యోగం’ ఎప్పుడో?

- ప్రభుత్వ పాఠశాలల్లో కానరాని సైన్స్‌ పరికరాలు
- కొన్నేళ్లుగా విడుదల కాని నిధులు



నందిపేట మండలం అయిలాపూర్‌ జిల్లా పరిషత్‌ పాఠశాల

నందిపేట్‌(ఆర్మూర్‌): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రయోగాలు చేసే యోగం ఎప్పుడొస్తుందోనని ఎదురుచూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సర్కార్‌ బడులకు ఆరేళ్లుగా నిధులు విడుదల కాకపోవడం, సరిపడా సైన్స్‌ పరికరాలు లేకపోవడంతో విద్యార్థులు ప్రయోగ విద్యకు దూరమవుతున్నారు. అయినా సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

‘ఉన్నత’ విద్యార్థుల కోసం..

జిల్లాలో 1042 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇందులో 77,224 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైన్స్‌ విద్యను అందిచాలనే లక్ష్యంతో ప్రయోగశాలలు ఏర్పాటు చేసినా కొన్నేళ్లుగా నిధుల లేమితో లక్ష్యం నీరుగారుతోంది. విధిలేని పరిస్థితుల్లో ఉపాధ్యాయులు ఉన్న పరికరాలతోనే పాఠాలు బోధించి మమ అనిపిసున్నారు. 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు సైన్స్‌ సబ్జెక్టులలో ఎక్కువ భాగం ప్రయోగాలతో కూడిన పాఠ్యాంశాలు ఉంటాయి. వాటిని ప్రయోగం చేసి చూపితే గాని అర్థం కాని పరిస్థితి. దీంతో ప్రయోగాత్మక బోధనపై సంబంధిత సబ్జెక్టుకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రయోగ పరికరాలు, రసాయనాల కొనుగోలుకు గతంలో విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అప్పట్లో అరకొర నిధులు మంజూరు చేయగా కొద్దిపాటి పరికరాలు కొనుగోలు చేశారు. కొద్దిపాటి పరికరాలతో ప్రయోగాలు సంపూర్ణంగా చేసే అవకాశం లేకపోవడంతో పలు పాఠశాలల్లో అవిసైతం మూలన పడ్డాయి.

2019 నుంచి..

రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్‌ ద్వారా ప్రతి ఉన్నత పాఠశాలకు 2019లో రూ. 50వేలు, ప్రాథమిక పాఠశాలలకు రూ. 22వేలు విడుదల చేశారు. వీటి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఆరేళ్ల క్రితం కొన్ని పరికరాలు కొనుగోలు చేశారు. ఫలితంగా పాఠశాలల్లో ప్రయోగాత్మక బోధన నిర్వహణ కష్టతరంగా మారింది. అందులో ఉన్న పరికరాలతో పాటు కాలం చెల్లిన రసాయనాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తూ మమ అనిపిస్తున్నారు. ప్రయోగాలపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో సైన్స్‌ పోటీలకు విద్యార్థులు దూరంగా ఉంటున్నారు. ఏటా ప్రభుత్వం నిర్వహించే సైన్స్‌ఫేర్‌, ఇన్‌స్పైర్‌ అవార్డుల్లో వెనుకబడుతున్నారు. ప్రతిభ ఉన్నా సరిపడా శిక్షణ, అవగాహన లేక విద్యార్థులు సత్తా చాటలేకపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రయోగాత్మక బోధనకు అవసరమైన పరికరాలు సమకూర్చాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు మంజూరు కాలేదు..



సైన్స్‌ పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరు కాగానే పరికరాలు కొనుగోలు చేస్తాం. విద్యార్థులకు కావాల్సిన కొన్ని సైన్స్‌ పరికరాలను ఉపాధ్యాయులు తయారు చేసి అవగాహన కల్పిస్తున్నారు.

– అవదూత గంగాధర్‌, ఎంఈవో, నందిపేట

ఇలా వచ్చి.. అలా వెళుతున్నారు

- ఆర్‌అండ్‌బీలో ఉన్నతాధికారుల పరిస్థితి
- బాధ్యతలు స్వీకరించిన కొన్ని నెలలకే పదవీవిరమణ
- ఇన్‌చార్జి అధికారులతో నెట్టుకొస్తున్న వైనం



జిల్లా ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాలయం

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ శాఖలో కీలక అధికారులు వచ్చిన కొన్నినెలలకే పదవీ విరమణ చేస్తుండటంతో ఆయా పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. దీంతో ఇన్‌చార్జి అధికారులతో పాలనను నెట్టుకొస్తున్నారు. ఈక్రమంలో ఎప్పుడు అధికారులతో నిండుగా ఉండే జిల్లాకేంద్రంలోని కార్యాలయం ఖాళీల కారణంగా బోసి పోతుంది.

ముఖ్యమైన పోస్టులు ఖాళీ..

ఆర్‌అండ్‌బీలో ప్రధానంగా ఎస్‌ఈ, ఈఈ, డిప్యూటీ ఎస్‌ఈ మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు ఎస్‌ఈ కార్యాలయంలో సూపరింటెండెంట్‌ పోస్టు ఖాళీగా ఉంది. శాఖలో బాల్కొండ, ఆర్మూర్‌, బోధన్‌, నిజామాబాద్‌ అర్బన్‌, నిజామాబాద్‌ రూరల్‌ ఐదు సబ్‌ డివిజన్‌లున్నాయి. బాల్కొండ సబ్‌ డివిజన్‌కు డిప్యూటీ ఈఈ లేకపోవడంతో ఆర్మూర్‌ సబ్‌ డివిజన్‌ డిప్యూటీ ఈఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో సబ్‌ డివిజన్‌కు ఒక్కో ఏఈ మాత్రమే ఉండడంతో తమపై పనిభారం పెరుగుతోందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్‌అండ్‌బీలో పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

నిజామాబాద్‌ జిల్లా ఆర్‌అండ్‌బీ శాఖలో ఎస్‌ఈగా విధులు నిర్వహించిన సత్యనారాయణరెడ్డి ఇటీవల పదవీ విరమణ చేశారు. గత నెలలో డిప్యూటి ఎస్‌ఈ సైతం కొన్ని రోజులు ఈఈగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే. ఈఈగా సురేష్‌ ఫిబ్రవరి 28న పదవీ విరమణ చేశారు. అనంతరం డిప్యూటీ ఈఈ శ్రీమాన్‌ ఇన్‌చార్జి ఈఈగా వ్యవహరించి ఏప్రిల్‌ 30న పదవీ విరమణ చేశారు. ఆ తర్వాతా డిప్యూటీ ఎస్‌ఈ కూడా ఇన్‌చార్జిగా వ్యవహరించి వీడ్కోలు పలికారు. సత్యనారాయణరెడ్డి కంటే ముందు ఎస్‌ఈగా విధులు నిర్వహించిన హన్మంత్‌రావు 6 నెలలు గడవకముందే సీఈగా పదోన్నతి పొంది, పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే.

సెర్ప్‌ సీఈవోకు ‘కమ్మర్‌పల్లి’ పిండివంటలు



సెర్ప్‌ సీఈవో దివ్య దేవరాజన్‌కు పిండి వంటలను అందజేస్తున్న ఐకేపీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

కమ్మర్‌పల్లి: నిజామాబాద్‌ జిల్లా కమ్మర్‌పల్లిలో మహిళా సమాఖ్య సభ్యులు తయారుచేసిన పిండి వంటలు రాష్ట్ర రాజధానికి చేరాయి. హైదరాబాద్‌లోని తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్‌) రాష్ట్ర ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) దివ్య దేవరాజన్‌కు శుక్రవారం ఐకేపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కమ్మర్‌పల్లి ఎర్గట్ల ఏపీఎం కుంట గంగాధర్‌ మర్యాదపూర్వకంగా కలిశారు. శాఖలో బదిలీల ప్రక్రియ పూర్తి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కమ్మర్‌పల్లి సమాఖ్య సభ్యులు వనజ ‘పెద్దమ్మ తల్లి హోమ్‌ ఫుడ్స్‌’ పేరుతో తయారుచేసిన పిండి వంటలను వారు ఆమెకు అందజేశారు. మహిళా సంఘం ద్వారా రుణం పొంది ఉపాధి పొందుతున్న సభ్యులు తయారుచేసిన లడ్డులను అందించడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఏపీఎం కుంట గంగాధర్‌ వెల్లడించారు. మహిళా సంఘ సభ్యులు తయారుచేసిన పిండివంటలకు విస్తృత ప్రచారం లభించేలా చూడాలని అధికారి పేర్కొన్నట్లు వెల్లడించారు. రాష్ట్ర జేఏసీ నాయకులు ఏపూరి సర్సయ్య, బాణాల రాజారెడ్డి, మహేష్‌, జానయ్య, యాదగిరి, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో రాఖీల కొనుగోళ్ల సందడి



కుమార్‌గల్లిలో కొనుగోలుదారులతో కిక్కిరిసిన రోడ్డు



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



వివిధ రకాల రాఖీలు

నిజామాబాద్‌ రూరల్‌/సాక్షి ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌: నిజామాబాద్‌ నగర మార్కెట్లో రాఖీల కొనుగోళ్లతో సందడి నెలకొంది. రాఖీ పౌర్ణమి(రక్షాబంధన్‌) సందర్భంగా మహిళలు, యువతులు వివిధ రకాల రాఖీలు, స్వీట్లు కొనుగోలు చేయడానికి శుక్రవారం నగరానికి భారీగా తరలివచ్చారు.

గత వారం రోజులుగా రాఖీల విక్రయాలు కొనసాగుతుండగా, పండుగ సమీపించడంతో నగరంలోని ప్రధాన చౌరస్తాలు, దుకాణాల్లో రద్దీ నెలకొంది. కుమార్‌గల్లి, పెద్దబజార్‌, గాయత్రినగర్‌చౌరస్తా, వినాయక్‌నగర్‌, కంఠేశ్వర్‌లలో దుకాణాలు పెట్టి వ్యాపారాలు సాగే అన్నిచోట్లా సందడి నెలకొంది. మార్కెట్లో రకరకాల రాఖీలు అందుబాటులో ఉండగా, కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

సోదర, సోదరీమణుల అనుబంధానికి ప్రతీక..

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్‌. శ్రావణ పౌర్ణమి రోజున ఈ పర్వదినాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఎక్కడెక్కడో ఉన్న సోదరసోదరీమణులు పండుగ పూట తప్పకుండ కలుసుకుంటుంటారు. సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి, మురిసిపోతారు. సోదరులు వారికి తోచిన కట్నం అందించి, వారి ఆశీర్వాదం తీసుకుంటారు.

పుట్టింటికి వెళ్లాల్సిందే..



అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే బంధం అనిర్వచనీయమైంది. మా తమ్ముడికి చిన్నప్పటి నుంచి రాఖీ కడుతున్నాను. పండుగ రోజు ఖచ్చితంగా పుట్టింటికి వెళ్లి, తమ్ముడికి రాఖీ కట్టాల్సిందే.

– లక్ష్మి, బర్ధిపూర్‌

ఆనందంగా ఉంటుంది..



రాఖీ పౌర్ణమి రోజున తమ్ముడికి రాఖీ కడితే చాలా సంతోషంగా ఉంటుంది. ఏటా రాఖీ పౌర్ణమి నాడు తమ్ముడికి రాఖీకడుతాను. ఈ పండుగ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తాను.

– నిక్షిత, ధర్మారం

సుభాష్‌నగర్‌లో అగ్నిప్రమాదం



ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌ నగర్‌లోగల ఓ ఇంటీరియర్‌ షాప్‌లో శుక్రవారం మధ్యాహ్నం షార్ట్‌ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగిందని ఫైర్‌ ఆఫీసర్‌ శంకర్‌ తెలిపారు. షాపు నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి ఫైర్‌ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని ఫైరింజన్‌తో మంటలను అర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 20 వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



మోర్తాడ్‌(బాల్కొండ): మోర్తాడ్‌ మండలం దొన్కల్‌లో ఒకరిని హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు భీమ్‌గల్‌ సీఐ సత్యనారాయణ తెలిపారు. మోర్తాడ్‌ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొన్కల్‌లోని వడ్డెర కాలనీలో జూన్‌ 26న ఒల్లెపు నాగరాజు, షేక్‌ రహమాన్‌తో మద్యం సేవిస్తూ ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో రహమాన్‌ను నాగరాజు కర్రతో కొట్టగా అతడు మృతిచెందాడు. అప్పటి నుంచి నిందితుడు నాగరాజు పరారీలో ఉన్నాడన్నారు. విశ్వసనీయ సమాచారం రావడంతో నాగరాజును పట్టుకొని, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



రుద్రూర్‌: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో శుక్రవారం తెల్లవారుజామున రెండు ఇసుక టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాటిని పోలీస్‌స్టేషన్‌ తరలించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండలంలోని గోప్యతండా పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రామకృష్ణ శుక్రవారం తెలిపారు. గడ్డమీదితండాకు చెందిన ఇద్దరు వ్యక్తులు తమ ట్రాక్టర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పోలీస్‌ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఇందల్వాయి: మండలంలోని రూప్లనాయక్‌ తండా వద్ద గల జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై సందీప్‌ తెలిపిన వివరాలు ఇలా.. తండాకు చెందిన తుంగర్‌ బాలాజీ(50) స్థానిక హోటల్‌లో పని చేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి అతడు రూప్లానాయక్‌ తండా నుంచి దేవి తండాకు నడుచుకుంటూ హైవేపై వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కొడుకు పవన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని సాయిబాబా ఆలయంలో దొంగతనం జరిగినట్లు మూడో టౌన్‌ ఎస్సై హరిబాబు తెలిపారు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి వెండి కిరీటం, ఇత్తడి సాయిబాబా విగ్రహం, ఇత్తడి సామగ్రి అపహరించినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆలయ అర్చకులు గుడికి వెళ్లగా, చోరీని గుర్తించి పోలీసుకలు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి వారు చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలుడి కిడ్నాప్‌

మోపాల్‌: మండలంలోని ముదక్‌పల్లి తండాకు చెందిన కెతావత్‌ హరీష్‌ (17) కిడ్నాప్‌నకు గురైనట్లు ఎస్సై జాడె సుస్మిత శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. తండాకు చెందిన హరీష్‌కు అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో పరిచయం ఏర్పడింది. ఈ విషయం ఆమె భర్తకు తెలియడంతో వారిని మందలించాడు. ఈక్రమంలో వివాహితను ఆమె భర్త ఈనెల 5న రాంచంద్రపల్లిలోని తల్లిగారింట్లో వదిలేసి వచ్చాడు. 7న సదరు వివాహిత హరీష్‌కు ఫోన్‌ చేయడంతో అతడు నిజామాబాద్‌ వెళ్లాడు. అప్పటి నుంచి అతడు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బాలుడి సోదరి హరీష్‌ కిడ్నాప్‌కు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దాబాపై పోలీసుల దాడి

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని గుండారం శివారులో గల దాబాపై గురువారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతి లేకుండా దాబాలో, బెల్టుషాపులో లిక్కర్‌ అమ్మకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ఆరీఫ్‌ తెలిపారు. ఈ దాడిలో ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పేకాడుతున్న పలువురి అరెస్టు

పిట్లం(జుక్కల్‌): మండల కేంద్రంలో పేకాట స్థావరంపై గురువారం రాత్రి పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.4,320 నగదు, 7 సెల్‌ ఫోన్లు, 2 బైకులతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

రుద్రూర్‌ మండలంలో..

రుద్రూర్‌: మండలంలోని రాణంపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 4510 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రెంజల్‌ మండలంలో..

రెంజల్‌(బోధన్‌): మండలంలోని సాటాపూర్‌ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్‌ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 8470 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



ఫుట్‌బాల్‌ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ

నిజామాబాద్‌ నాగారం: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని, క్రీడల ద్వారానే విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ధృడంగా తయారవుతారని అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని పాలిటెక్నిక్‌ గ్రౌండ్‌లో శుక్రవారం ఇందూర్‌ ఫుట్‌బాల్‌ అకాడమీ ఆధ్వర్యంలో టోర్నమెంట్‌ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో క్రీడాకారులకు సరైన సౌకర్యాలతో కూడిన మినీ స్టేడియం కావాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానన్నారు. ఇందూర్‌ బిడ్డలు జాతీయ, అంతర్జాతీయ, ఒలింపిక్స్‌ స్థాయిలో రాణించి జిల్లాకు మరింత పేరుప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. నాయకులు ఎర్రం సుదీర్‌, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కృష్ణ తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లిలో గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న భీమ్‌గల్‌ సీఐ సత్యనారాయణ

కమ్మర్‌పల్లి: మండలంలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. వివరాలను భీమ్‌గల్‌ సీఐ సత్యనారాయణ శుక్రవారం కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి, సిబ్బంది కలిసి కమ్మర్‌పల్లిలోని మెట్‌పల్లి రోడ్‌లోగల రైస్‌మిల్‌ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో స్కూటీపై ఇద్దరు వ్యక్తులు కమ్మర్‌పల్లి వైపు వస్తుండగా, పోలీసులు వారిని తనిఖీ చేయగా 4 గంజాయి ప్యాకెట్‌లు కనిపించాయి. వెంటనే వాటిని స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. వారిని జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన నాంపల్లి వికాస్‌, కమ్మర్‌పల్లికి చెందిన షేక్‌ ఇమ్రాన్‌గా గుర్తించారు. గంజాయిని కమ్మర్‌పల్లిలో విక్రయించడానికి తీసుకువస్తున్నామని, ఇంతకుముందు కూడా వికాస్‌ వద్ద గంజాయి కొనుగోలు చేసి కమ్మర్‌పల్లిలో విక్రయించానని షేక్‌ ఇమ్రాన్‌ ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టుకున్న గంజాయి 20 గ్రాములు ఉందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐ అనిల్‌రెడ్డి, హెడ్‌ కానిస్టేబుల్‌ మహ్మద్‌ అప్సర్‌ సిబ్బంది రాజ్‌కుమార్‌, లక్ష్మణ్‌గౌడ్‌, నవీన్‌చంద్ర, లక్ష్మణ్‌ నేత, గణపతినాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాజివాడిలో ఒకరి ఆత్మహత్య



శ్రీకాంత్‌రావు (ఫైల్‌)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రహ్మాజివాడి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన జోలే శ్రీకాంత్‌రావు(30) కామారెడ్డిలో ఓ ప్రయివేటు జాబ్‌ చేస్తున్నాడు. అతడికి వివాహం జరిపించడానికి కుటుంబ సభ్యులు గత కొన్ని సంవత్సరాల నుంచి పెండ్లి సంబంధాలు చూస్తున్నప్పటికీ కుదరలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీకాంత్‌రావు శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని, మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరు..



బాన్సువాడ రూరల్‌: ఆత్మహత్యకు యత్నించిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా.. మండలంలోని చిన్నరాంపూర్‌ గ్రామం పులికుచ్చ తండాకు చెందిన జప్పిబాయి (60) అనే వృద్ధురాలు గత కొన్ని సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయింది. ఈక్రమంలో ఈనెల 7న ఆమె పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్సనిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెట్టుబడి పేరుతో సైబర్‌ మోసం

గాంధారి(ఎల్లారెడ్డి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని నమ్మించి, ఒకరి వద్ద నుంచి సైబర్‌ మోసగాళ్లు రూ.లక్ష వరకు కాజేశారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. మండల పరిధిలోని గండివేట్‌ తండాకు చెందిన అనిల్‌ అనే వ్యక్తికి ఇటీవల గుర్తు తెలియన వ్యక్తి వాట్సప్‌ కాల్‌చేసి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని నమ్మించాడు. తాను పంపిన లింకుకు డబ్బులు పంపించాలని సూచించడంతో అనిల్‌ సదరు లింకుకు డబ్బులు పంపించాడు. అనంతరం తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు వెంటనే 1930 నంబరుకు సమాచారం అందించాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాహనాల తనిఖీల్లో వ్యక్తి వీరంగం

- పెట్రోల్‌ పోసుకుని, పోలీసుపై పోసి హంగామా

కామారెడ్డి క్రైం: పోలీసుల వాహనాల తనిఖీలకు విసిగిపోయిన ఓ వ్యక్తి అసహనంతో పెట్రోల్‌ పోసుకొని వీరంగం సృష్టించిన ఘటన కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని టేక్రియాల్‌ బైపాస్‌ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. సదాశివనగర్‌ మండలం కుప్రియాల్‌ గ్రామానికి చెందిన ఎల్లయ్య అనే వ్యక్తి శుక్రవారం ఆస్పత్రి పనుల నిమిత్తం కామారెడ్డికి వచ్చి, సాయంత్రం తిరిగి ఇంటికి బయలుదేరాడు. టేక్రియాల్‌ బైపాస్‌ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా, అతడి బైక్‌ను ఆపారు. తన వాహనాన్ని తరచూ ఆపుతూ జరిమానాలు వేస్తున్నారని ఎల్లయ్య అసహనానికి గురయ్యాడు. బండిలో పెట్టుకున్న పెట్రోల్‌ బాటిల్‌ను తీసుకొని ఒంటిపై పోసుకోవడమే కాకుండా అక్కడే ఉన్న ఓ కానిస్టేబుల్‌పై కూడా కొంత పోశాడు. వెంటనే పోలీసులు అప్రమత్తమై, అతడిని అడ్డుకుంటుండగా నానా హంగామా సృష్టించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు.

‘నిజాంసాగర్‌’లోకి ఇన్‌ఫ్లో

నిజాంసాగర్‌(జుక్కల్‌): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శుక్రవారం సాయంత్రం నిజాంసాగర్‌ ప్రాజెక్టులోకి 600 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. నిజాంసాగర్‌ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగుల (17.8 టీఎంసీ)కుగాను ప్రస్తుతం 1390.95 అడుగులు (4.448 టీఎంసీ)ల నీరు నిల్వ ఉందన్నారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు 600 క్యూసెక్కుల నీటిని ఆయకట్టు పంటల అవసరాల కోసం విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు.